# తీతుకు వ్రాసిన పత్రిక 2వ అధ్యాయము

## క్రైస్తవ ప్రవర్తన

నీవు హితబోధకనుకూలమైన సంగతులను బోధించుము. 2 ఏలాగనగా వృద్ధులు మితానుభవముగలవారును, మాన్యులును, స్వస్థబుద్ధిగల వారును, విశ్వాస ప్రేమ సహనములయందు లోపములేనివారునై యుండవలెననియు, 3 ఆలాగుననే వృద్ధస్త్రీలు కొండెకత్తెలును, మిగుల మద్యపానాసక్తులునై యుండక, 4 ప్రవర్తనయందు భయభక్తులు గలవారై యుండవలెననియు, దేవుని వాక్యము దూషింపబడ కుండునట్లు, యౌవనస్త్రీలు తమ భర్తలకు లోబడియుండుటకు తమ భర్తలను శిశువులను ప్రేమించు వారును స్వస్థబుద్ధిగల వారును పవిత్రులును ఇంట ఉండి పని చేసుకొను వారును మంచివారునై యుండవలెనని బుద్ధిచెప్పుచు, 5 మంచి ఉపదేశము చేయువారునై యుండవలెననియు బోధించుము. 6 అటు వలెనే స్వస్థబుద్ధిగలవారై యుండవలెనని యౌవనపురుషులను హెచ్చరించుము. 7 పరపక్ష మందుండువాడు మనలనుగూర్చి చెడుమాట ఏదియు చెప్ప నేరక సిగ్గుపడునట్లు అన్నిటి యందు నిన్ను నీవే సత్కార్యముల విషయమై మాదిరిగా కనుపరచు కొనుము. 8 నీ ఉపదేశము మోసములేనిదిగాను మాన్యమైనదిగాను నిరాక్షేపమైన హితవాక్యముతో కూడినది గాను ఉండవలెను. 9 దాసులైన వారు అన్ని విషయములయందు మన రక్షకుడగు దేవుని ఉపదేశమును అలంకరించునట్లు, 10 తమ యజమానులకు ఎదురుమాట చెప్పక, ఏమియు అపహరింపక, సంపూర్ణమైన మంచి నమ్మకమును కనుపరచుచు, అన్ని కార్యములయందు వారిని సంతోషపెట్టుచు వారికి లోబడియుండవలెనని వారిని హెచ్చరించుము.

## క్రైస్తవ విధులు

11 ఏలయనగా, సమస్త మనుష్యులకు రక్షణకరమైన దేవుని కృప ప్రత్యక్షమై, 12 మనము భక్తిహీనతను, ఇహలోక సంబంధమైన దురాశలను విసర్జించి, శుభప్రదమైన నిరీక్షణ నిమిత్తము 13 అనగా మహా దేవుడును మన రక్షకుడునైన యేసుక్రీస్తు మహిమయొక్క ప్రత్యక్షత కొరకు ఎదురుచూచుచు, ఈ లోకములో స్వస్థబుద్ధితోను నీతితోను, భక్తితోను బ్రదుకుచుండవలెనని మనకు బోధించుచున్నది. 14 ఆయన సమస్తమైన దుర్నీతినుండి మనలను విమోచించి, సత్క్రియలయందాసక్తి గల ప్రజలనుతన కోసరము పవిత్రపరచుకొని తన సొత్తుగా చేసికొనుటకు తన్నుతానే మనకొరకు అర్పించుకొనెను. 14 వీటినిగూర్చి బోధించుచు, హెచ్చరించుచు, సంపూర్ణాధి కారముతో దుర్బోధలు ఖండించుచు నుండుము. నిన్నెవనిని తృణీకరింపనీయకుము.